క్లుప్తంగా

మినుమ తీత పనులు ప్రారంభం



పామర్రు: వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు మినుము పైరు తీత పనులు మొదలుపెట్టారు. మండలంలో 23 వేల ఎకరాల్లో మినుము పంట సాగు చేస్తున్నారు. మినుము పంట అదునుకు రావడంతో కాయ తీత పనులను నిర్వహిస్తున్నారు. అనుకూల వాతావరణం తెగుళ్లకూడా అంతగా లేకపోవడం కారణం. పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 4 నుంచి 5 బస్తాల దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు. మినుము పంట బస్తాకు ప్రభుత్వం రూ.7,500 గిట్టుబాటు ధర ప్రకటించడంతో రైతులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్నారు.

వీకేఆర్ ఫెస్ట్–2023 పోస్టర్ల ఆవిష్కరణ



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 3,4 తేదీల్లో వీకేఆర్ ఫెస్ట్–2023 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. కళాశాల కార్యాలయంలో ఫెస్ట్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు పాల్గొనే ఈ కార్యక్రమంలో అనేక ఈవెంట్స్ ఉంటాయన్నారు. అన్ని విభాగాలకు కలిపి రూ.2 లక్షలు పైబడి బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 6301595271ను సంప్రదించాలని కోరారు.

ఆ హార పొట్లాల పంపిణీ



పామర్రు: దాతల సహకారంతో నిరుపేదలైన వారికి ఆహారపు పొట్లాల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని పామర్రు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద పేదలకు ఆహారపు పొట్లాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామ వాస్తవ్యులు చెరుకూరి వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి భార్య అమ్మాజీ ఆర్థిక సహాయంతో 50 మందికి ఆహారపు పొట్లాల పంపిణీ చేశామన్నారు. సంఘ అసోసియేట్ అధ్యక్షులు వై.ఎస్.బోసు, ప్రధాన కార్యదర్శి ఎన్.నాగిరెడ్డి, కోశాధికారి కె.వీరయ్య, సభ్యులు జి.అచ్చియ్య, ఆర్ సుబ్రమణ్యం, వీ నాగేశ్వవరరావు, టీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి మహోత్సవం



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి దుర్గా నగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు పసుమర్తి రామకృష్ణ విఘ్నేశ్వర పూజ, పంచామృతం, అష్టోత్తర సహస్ర నామ పూజలు జరిపారు. అనంతరం మేళతాళాల మధ్య అమ్మవారి ఊరేగింపుని ఉత్సాహంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున నిర్వహించిన అన్నదాన కార్యక్రమం చేశారు. మొవ్వ, ఘంటసాల, పమిడిముక్కల మండలాలకు చెందిన భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. భక్తులు మొక్కులు తీర్చుకుని అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు.

శ్రీకాకుళం–గాజుల్లంక ప్రజావారధి ప్రారంభం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం–గాజుల్లంక ప్రజా వారధి శుక్రవారం ప్రారంభమైంది. గత ఏడాది కృష్ణానదికి వచ్చిన వరదలకు గతంలో వేసిన రహదారి కోతకు గురై కొట్టుకుపోయింది. శ్రీకాకుళం, గాజుల్లంక గ్రామస్తులంతా కలిసి మళ్లీ రహదారిని నిర్మించుకున్నారు. రహదారి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుకు రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అందుబాటులోకి వచ్చిన వారధిని గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు ఈ ప్రజా రహదారిని వినియోగించుకోవాలని కోరారు.

మహా శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న ఆలయాలు
- నేడు శివాలయాలను సందర్శించనున్న భక్తులు



ఐలూరులో ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, అధికారులు



తోట్లవల్లూరు ఘాట్ వద్ద జల్లుస్నానాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంపీడీఓ

తోట్లవల్లూరు: మహాశివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మూడు నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలన్నీ సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్నాయి. తోట్లవల్లూరు మండలం ఐలూరులో దక్షిణకాశీగా పేరొందిన శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయం, తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయాలు విద్యుద్దీపకాంతులతో కళకళలాడుతున్నాయి. ఆయా ఆలయాలలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేశారు. ఐలూరులో ఆలయం వద్ద బారికేడ్ల ఏర్పాటును జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత, పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు శుక్రవారం పరిశీలించారు. కరకట్టపై ట్రాఫిక్‌ను మళ్లించటంతో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణానది వద్ద భక్తుల స్నానాల కోసం జల్లుస్నానాలను ఏర్పాటు చేశారు. తోట్లవల్లూరు ఘాట్ వద్ద ఏర్పాట్లను తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులను పూర్తి చేశారు.

గుడివాడటౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం (పెద్దశివాలయం), గౌరీశంకరపురంలో వేంచేసియున్న గౌరీశంకర స్వామి దేవస్థానం (చిన్నశివాలయం), స్థానిక బేతవోలులోని శ్రీ ఆనందేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అన్ని ఆలయాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా స్వామి వారి దర్శనానికి భారీ బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

కైకలూరు(కలిదిండి): దక్షిణ కాశీగా పేరుగడించిన కలిదిండి శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శనివారం శివరాత్రి రోజున లక్షకు పైగా భక్తుల విచ్చేస్తారని అధికారులు అంచనా వేశారు. బందోబస్తు నిమిత్తం ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.పైడేశ్వరరావు ఆధ్వర్యంలో కైకలూరు రూరల్, పట్టణ సీఐలు వైవీవీఎల్.నాయుడు, ఎంవీఎస్.నాగరాజు పోలీసు సిబ్బంది, వలంటీర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించామన్నారు. స్వామివారి దర్శనానికి 'క్యూ' లైన్లు ఏర్పాటు చేశామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. జాతరకు డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 250 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కలిదిండి ఎస్‌ఐ మణికుమార్ పాల్గొన్నారు.

భోగేశ్వరునికి బిల్వార్చన

శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా పాతాళ భోగేశ్వరస్వామికి లక్షబిల్వార్చన శుక్రవారం ఘనంగా జరిగింది. శనివారం అర్ధరాత్రి స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ఆటపాకలో శ్రీ కనకలింగేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ వీరభద్ర కల్యాణం వైభవంగా జరిగింది.



భోగేశ్వరలంకలో స్వామివారికి లక్ష బిల్వార్చన



కలిదిండి భోగేశ్వరలంకలో శివరాత్రి తీర్థంపై పోలీసుల సమావేశం



గుడివాడ పట్టణంలో విద్యుత్ కాంతుల్లో పెద్దశివాలయం

సంక్షేమ పథకాలు ఆదుకున్నాయి

- ఎమ్మెల్యే డీఎన్నార్‌తో లబ్ధిదారులు
- పుట్లచెరువులో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ప్రభుత్వ పథకాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఆదుకున్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఎదుట పేర్కొన్నారు. మండలంలోని పుట్లచెరువులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాయా లేదా అంటూ ఆరా తీశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ కుటుంబాలకు కల్పిస్తున్న భరోసాను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న అభివృద్ధి పనులతో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు చూపు ఏపీ వైపే ఉంద న్నారు. నిరుపేదలకు ప్రభుత్వం నివేశన స్థలాలు అందజేసి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నవరత్నాల పథకం ద్వారా పేదల ఇంట సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), వైస్ ఎంపీపీ ఆగస్తీ ఆదివిష్ణు, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, సర్పంచ్ గురుగుబెల్లి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, సర్పంచ్‌లు కాగిత సూర్యనారాయణ, బలే నాగరాజు, బుర్ల భోగేశ్వరరావు, నాగదాసి థామస్, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మెండా సురేష్, మాజీ ఎంపీటీసీ కూనా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు ఎమ్మెల్యే నాని నివాళి



మాణిక్యాలరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: మండలంలోని లింగవరం గ్రామంలో గురువారం మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మట్టా మాణిక్యాలరావు మృతదేహాన్ని శుక్రవారం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) సందర్శించారు. లింగవరం గ్రామంలో మాణిక్యాలరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి జీవితాంతం కాంగ్రెస్‌పార్టీకే అంకితమయ్యారన్నారు. ఎన్ని రాజకీయ వత్తిడిలు వచ్చినా పార్టీని వీడకుండా పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవలందించిన మహానుబావుడు మట్టా మాణిక్యాలరావు అని కొనియాడారు. ఎమ్మెల్యే వెంటతహసీల్దార్ ఆంజనేయులు, నందివాడ ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్,నందివాడ,రూరల్‌ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలడుగు రాంప్రసాద్, దుక్కిపాటి శశిభూషన్, తదితరులు పాల్గొన్నారు.

తపాలా స్టాంపుల ప్రదర్శనలో పతకాలు



విశాల్ పాండ్య నుంచి పతకం అందుకుంటున్న నరసింహారావు

గుడివాడటౌన్: తపాలా స్టాంపుల ప్రదర్శనలో గుడివాడకు చెందిన ఇరువురికి కాంస్య పతకాలు దక్కాయి. ఈ పోటీలో కాంస్య పతకం పొందిన విజయవాడ కోర్టులో సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ దేవు నరసింహారావు వివరాలను శుక్రవారం ఇక్కడ వెల్లడించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా తపాలాశాఖ ఫిలాటలీ (తపాలా స్టాంపుల ప్రదర్శన) కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఢిల్లీలో 'అమృత్ పెక్స్–2023' పేరుతో ప్రదర్శన నిర్వహించింది. సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ దేవు నరసింహరావు విశ్వకర్మకు, గుడివాడకు చెందిన మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయిని పుట్టి నాగలక్ష్మికి కాంస్య పతకాలు లభించాయని తెలిపారు. వీరికి ఫిలాటలీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రసిడెంట్ విశాల్ పాండ్య ఈ బహుమతులు అందజేశారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎండీ రఫీ

జుఝవరం(పామర్రు): జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్–2023 పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎండీ రఫీ తెలిపారు. మండల పరిధిలోని జుఝవరం గ్రామంలోని ఉషోదయ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు గ్రామంలో ఈనెల 12వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. అండర్–11 కటా విభాగంలో ఐదుగురు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాలను సాధించారని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరానికి చేరుకోవాలంటే శారీరక, మానసిక దృఢత్వం ఉండటానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మరో నలుగురుగు వెండి పతకాలు సాధించారన్నారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న భూ హక్కు పత్రాలతో మేలు



సదస్సులో మాట్లాడుతున్న సిద్ధార్థజైన్

గుడ్లవల్లేరు: వైఎస్సార్ జగనన్న రీ సర్వే అనంతరం ప్రభుత్వం రైతులకు ఇచ్చే భూహక్కు పత్రాలతో ఎంతో మేలు చేకూరుతుందని సర్వే శాఖ రాష్ట్ర కమిషనర్ సిద్ధార్థజైన్ అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరులో భూహక్కు–భూసర్వేపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. రైతులకు ఇచ్చే ఈ పత్రం ఆధార్ కార్డువంటిదన్నారు. దీనిద్వారా బ్యాంకు రుణాలు, ఆర్థిక సహకారాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో సర్వే సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ సర్వే గురించి మండలంలోని ప్రతి ఒక్క రైతుకు అర్థం అయ్యేలాఅధికారులు పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రాంతాల వారీగా సర్వేలు నిర్వహిస్తున్నామని సర్వే అధికారుల పనితీరును ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జేసీ అపరాజితాసింగ్, ఆర్డీఓ పీ పద్మావతి, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో జంగిల్ క్లియరెన్స్



కైకలూరు: వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిశుభ్రత పాటించడానికి అందరూ కృషి చేయాలని కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత పేర్కొన్నారు. ఏఎంసీ నిధులతో ప్రాంగణంలోని చెత్త, పిచ్చిమొక్కలను పొక్లయిన్‌తో శుక్రవారం తొలగించే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఏఎంసీ ప్రాంగణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తామన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కొండరాజు మాట్లాడుతూ ఏఎంసీ ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ బి.సౌజన్య, నాయకులు దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.

నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలి

హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వేణుగోపాల్



మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా చూడాల హౌసింగ్ కార్పొరేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని సచివాలయ ఇంజినీరింగు అసిస్టెంట్లతో ఇంటి నిర్మాణాలపై సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.మల్లీశ్వరీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా దశలవారీగా ప్రభుత్వం బిల్లులను మంజూరు చేస్తుందన్నారు. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు కాలనీల్లో ఉగాది నాటికి అధిక సంఖ్యలో గృహప్రవేశాలు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు గంటా సంధ్య మాట్లాడుతూ ఇంజినీరింగు అసిస్టెంట్లు రెట్టించిన ఉత్సాహంతో నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులను చైతన్యపర్చాలన్నారు. హౌసింగ్ ఏఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

కొండలమ్మకు ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు(వేమవరం): గుడ్లవల్లేరు మండలం వేమవరంలో శ్రీ కొండలమ్మ అమ్మవారిని కేంద్ర సీఏజీ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. గుడ్లవల్లేరు భూసర్వే అవగాహనా సదస్సుకు విచ్చేసిన అధికారులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో సీఏజీ సభ్యులు పి ప్రసాద్, సుశాంత్, ఆర్డీఓ పి పద్మావతి, ల్యాండ్ డిపార్ట్‌మెంట్ సర్వేయర్ ఎస్ గోపాలరాజు, తహీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్ ఉన్నారు. ఆలయ ఈఓ కె సురేష్‌బాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహ నిర్మాణాలు, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి మండల స్థాయి అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని లేఅవుట్లలో గృహనిర్మాణాల పురోగతి పెంచాలన్నారు. మండలం, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ప్రతి వారం ప్రగతి నివేదికలను అందజేయాలన్నారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను చిలకలపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఆర్. రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు వివరాలు తెలిపారు. మచిలీపట్నం ఇంగ్లిషుపాలెంకు చెందిన పేరవల్లి శరత్, బందరు మండలం నవీన్‌మిట్టల్ కాలనీకి చెందిన సింగంశెట్టి సాయిగోపీచంద్‌లు స్నేహితులు. అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో పెట్టి విక్రయించేవారు. మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్‌లో పెడనకు చెందిన మట్టా భార్గవ్ అనే యువకుడికి గంజాయి ప్యాకెట్ అమ్ముతుండగాపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం శరత్, గోపీచంద్‌ల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న శరత్, గోపీచంద్, గంజాయి సేవిస్తున్న భార్గవ్‌పై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కురుమద్దాలి(పామర్రు): విజయవాడ–మచిలీ పట్నం జాతీయ రహదారిలో కురుమద్దాలి ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి మచిలీపట్నంకు ముగ్గురు యువకులు పల్సర్ బైక్‌పై వేగంగా వస్తున్నారు. బైక్ కురుమద్దాలి గ్రామ ఫ్లైఓవర్ వద్దకు రాగానే అతి వేగానికి బైక్ అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు కింద పడిపోయారు. వీరిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉండగామరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు వివరాలను సేకరించారు.

విద్యార్థి గణేష్ మృతి బాధాకరం

కోనేరుసెంటర్: యూనివర్సిటీ విదార్థి గణేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంబాధాకరమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతిరామ్మోహనరావు అన్నారు. కృష్ణా యూని వర్సిటీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎంసీఏ విద్యార్థి గణేష్ సంస్మరణ సభ శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించారు. గణేష్ చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రొఫెసర్ రామిరెడ్డి, ప్రొఫెసర్ మారుతి, కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

100 పశువులకు వైద్య పరీక్షలు



పశువులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు, పక్కన క్లబ్ సభ్యులు

గుడివాడటౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఉపద్రష్ట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. రూరల్ మండలం శేరీదింటకుర్రు గ్రామంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో 100కు పైగా పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువుల్లో నట్టల నివారణ, గర్భకోశవ్యాధుల నివారణకు సంబంధించిన మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్స్ అందజేశారు. రూరల్ మండల ఎంపీపీ గద్దె పుష్పరాణి, లయన్స్‌క్లబ్ ప్రగతి అధక్షుడు మల్లంపల్లి వెంకట్రావు, సెక్రటరి ఎన్ శేషగిరిరావు, జోనల్ చైర్మన్ ఆర్ వేణుబాబు, ఎంపీ శేఖర్, వైద్యాధికారులు డాక్టర్ చింతయ్య, డాక్టర్ శ్రీవీణ, డాక్టర్ వేణు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రమణారావు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులకు మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ సీహెచ్ రమణారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే బిల్లులు వెంటనే వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగరరాణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్చి 22న టిడ్కో ఇళ్ల పంపిణీ



కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: మల్లాయిపాలెం లేఅవుట్‌లో నిర్మించిన టిడ్కో ఇళ్లను మార్చి 22వ తేదీన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్ నిర్మాణం కొనసాగుతుందన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తయిందన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామన్నారు.

బంగారు నాణెం అందజేత

పెడన: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని అచ్చయ్యవారిపాలెం, చోడవరం గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల కోసం ప్రవేశపెట్టి కల్యాణమస్తు పథకం కింద బంగారు నాణెం (4 గ్రాములు)ను శుక్రవారం అందజేశారు. దిండి నాగరాజు కుమార్తె ప్రశాంతి, రావి సుబ్బారావు కుమారుడు నాగమల్లేశ్వరరావుల పెళ్లికి ఈ నాణెన్ని అందించామని జిల్లా పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com